# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ సార్వభౌమత్వ పరిరక్షణలో సాయుధ దళాల పాత్ర కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు.
- అంతరిక్ష రంగంలో పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- భారత్, ఇండోనేషియా దేశాలు వేల సంవత్సరాల నాటి నాగరిక సంబంధాలను పంచుకుంటున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- ఒకే దేశం.. ఒకే పన్ను.. వంటి సంస్కరణలు దేశ పన్నుల విధానాన్ని సరళీకరించాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలియజేశారు.

================

దేశ సార్వభౌమత్వ పరిరక్షణలో సాయుధ దళాల పాత్ర కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన చాణక్య డిఫెన్స్ డైలాగ్ -2025లో రాష్ట్రపతి మాట్లాడుతూ.. భద్రతా పరమైన సవాళ్ళను సాయుధ దళాలు అద్భుతమైన రీతిలో అధిగమిస్తున్నాయన్నారు. ఉగ్రవాద వ్యతిరేక వ్యూహంలో "ఆపరేషన్ సిందూర్" ఒక నిర్ణయాత్మక క్షణమన్న రాష్ట్రపతి.. భారతదేశ సైనిక సామర్థ్యాన్ని ప్రపంచం గమనించిందని చెప్పారు. శాంతి సాధనలో ధృఢంగాను, బాధ్యతాయుతంగాను వ్యవహరించడం భారత సైన్యం నైతికతను వెల్లడిస్తోందని స్పష్టం చేశారు. రక్షణ దళాలు తమ సాధారణ కార్యకలాపాలతో పాటు జాతీయ అభివృద్ధికి కూడా ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. సరిహద్దుల్లో భద్రతను పటిష్టం చేస్తూ.. మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పర్యాటక రంగాల ద్వారా సరిహద్దు ప్రాంత అభివృద్ధికి రక్షణ దళాలు సహాయపడుతున్నాయని రాష్ట్రపతి వివరిస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

================

అంతరిక్ష రంగంలో ప్రపంచ పెట్టుబడిదారులకు భారత్ ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఈరోజు దృశ్య మాధ్యమ విధానంలో పాల్గొని మాట్లాడారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగంలో అనేక కీలక సంస్కరణలను చేపట్టిందన్నారు. ప్రైవేట్ ఆవిష్కరణలకు ఈ రంగంలో వెసులుబాటు కల్పించి.. అంకుర సంస్థలు, పరిశ్రమలు దేశీయ ఎకో సిస్టమ్‌తో కలిసి పని చేసేందుకు మార్గం సుగమం చేశామన్నారు. రానున్న సంవత్సరాల్లో ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ గణనీయంగా అభివృద్ధి చెంది, యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ దేశ నూతన ఆలోచనలకు, ఆవిష్కరణలకు, యువ శక్తికి అద్దంపడుతుందన్నారు. ఇస్రో కొన్ని దశాబ్దాలుగా భారతదేశ అంతరిక్ష ప్రయాణాన్ని నూతన శిఖరాలకు చేరుస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

================

భారత్ ఇండోనేషియా దేశాలు వేల సంవత్సరాల నాటి నాగరిక సంబంధాలను పంచుకుంటున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇండోనేషియా రక్షణ మంత్రి షాఫీ షామ్ షొఎదెన్ తో న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన చర్చల సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. బహుత్వవాదం, సమ్మిళితత్వం, పాలనా విలువలు రెండు దేశాలకు సాధారణ అంశాలని, ఈ ఉమ్మడి అంశాలే ఇరు దేశాల మధ్య సమకాలీన సంబంధాలకు దిశానిర్దేశం చేశాయని పేర్కొన్నారు. రెండు దేశాలు చారిత్రక, సాంస్కృతిక, నాగరిక సంబంధాలను పంచుకునే పొరుగు దేశాలన్నారు. నేడు జరుగుతున్న చర్చలు ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సహకారానికి మరింత ఊతమిస్తాయని, పరస్పర సహకారానికి కీలకమని ఆయన వ్యాఖ్యానించారు.

(వాయిస్ 32 సెకన్లు)

విరామం

================

ఒకే దేశం.. ఒకే పన్ను.. వంటి సంస్కరణలు దేశ పన్నుల విధానాన్ని సరళంగాను, పారదర్శకంగాను మార్చాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. న్యూఢిల్లీలో ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) 76వ బ్యాచ్ ఆఫీసర్ ట్రైనీలను ఉద్దేశించి ఆయన ఈరోజు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, శ్రేయస్సుకు ఈ సంస్కరణలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. యువ ఆఫీసర్ ట్రైనీల ధైర్యమైన, దృక్పథాలు భారత్ ప్రపంచ నాయకత్వం వైపు పురోగమించడానికి సహాయపడతాయని చెప్పారు. ఐఆర్ఎస్ అధికారులను దేశ ఆర్థిక బలానికి కీలక స్తంభాలుగా అభివర్ణిస్తూ.. వారు పన్నుల వసూళ్ళలోను, సులభతర వాణిజ్యంలోను కీలక పాత్ర పోషిస్తారన్నారు. అక్రమ వాణిజ్యం, మనీలాండరింగ్ నిరోధించడంలోను, ఆర్థిక క్రమశిక్షణను కాపాడుకోవడంలో ప్రధానంగా వ్యవహరిస్తారని ఓంబిర్లా పేర్కొన్నారు.

================

దివ్యాంగులపై అవమానకరమైన వ్యాఖ్యలను నివారించేలా కఠినమైన చట్టాలను రూపొందించాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అంగవైకల్యం కలిగిన వ్యక్తులను అపహాస్యం చేసే వ్యాఖ్యలను శిక్షార్హమైన నేరాలుగా పరిగణించేలా ఎస్సీ, ఎస్టీ చట్టం తరహా చట్టాలను తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని పేర్కొంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అశ్లీల, అభ్యంతరకరమైన లేదా చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను నియంత్రించడానికి స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది.

================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు కర్ణాటకలోని ఉడిపి శ్రీకృష్ణ మఠాన్ని సందర్శించి, లక్ష కాంత గీత పారాయణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆలయం ఎదురుగా నిర్మించిన సువర్ణ తీర్థ మండపాన్ని ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం సార్ధ పంచశత మానోత్సవం సందర్భంగా గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్తగలి జీవోత్తమ మఠం 550వ వార్షిక వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొంటారు. మఠంలో 77 అడుగుల శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, రామాయణ థీమ్ పార్క్ గార్డెన్‌ను కూడా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా… ప్రధానమంత్రి ప్రత్యేక పోస్టల్ స్టాంపును, స్మారక నాణాన్ని విడుదల చేసి, అక్కడ జరిగే సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అదే విధంగా.. ఈ నెల 29 నుండి 2 రోజుల పాటు ఛత్తీస్‌గఢ్‌లో ప్రధానమంత్రి పర్యటించనున్నారు.

================

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో భాగంగా గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఈరోజు ప్రముఖ సినిమాటో గ్రాఫర్, నిర్మాత కె. వైకుంఠ్ గౌరవార్థం స్మారక స్టాంపును విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సావంత్ మాట్లాడుతూ.. వైకుంఠ్.. భారతీయ సినిమాలపై చెరగని ముద్ర వేశారని, క్లాసిక్ ఇండియన్ సినిమా దృశ్య భాషను కెమెరాతో బంధించిన గొప్ప వ్యక్తి  అని కొనియాడారు. వైకుంఠ్ ప్రత్యేక శైలి.. అద్భుతమైన దృశ్యాలు, మృదువైన, మానవ భావోద్వేగాలతో కూడినదని వివరించారు. ఉత్సవాల్లో భాగంగా వైకుంఠ్ 1977 డాక్యుమెంటరీ - గోవా మార్చ్స్ ఆన్ చిత్రాన్ని ప్రదర్శించారు.

================

అమెరికా విధించిన 50 శాతం సుంకాల ప్రతికూల ప్రభావం నుండి దేశాన్ని రక్షించడానికి వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు దోహదపడతాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) పేర్కొంది. భారత ఆర్థిక వ్యవస్థ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 6.6 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. భారత ఆర్థిక వ్యవస్థ బాగా పని చేస్తోందని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం ఆర్థిక వృద్ధి తర్వాత, 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో GDP 7.8 శాతం పెరిగిందని IMF వివరించింది.

================

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో బలమైన వాయుగుండం ఏర్పడిందని భారత వాతావరణ  విభాగం (ఐఎండీ) తెలిపింది. దీని కారణంగా ఈ నెల 30వ తేదీన తమిళనాడులో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 28, వచ్చే నెల 1 తేదీల్లో కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలియజేసింది.

================

లక్నోలో జరిగిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో 16 ఏళ్ల భారత షట్లర్ తన్వి శర్మ విజయం సాధించింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ నోజోమి ఒకుహారాను ఓడించడంతో ఆమె మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకుంది.

================
================